బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ మంగళవారం 05 నవంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4

## రేషన్ కార్డు లేకపోయినా ఇందిరమ్మ ఇండ్లు

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రేషన్ కార్డు లేకపోయినప్పటికీ పేదవారు, బహు పేదవారి కేటగిరీ కింద మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. త్వరలో రేషన్ కార్డుల జారీ ప్రక్రియ మొదలవుతుందన్నారు. అయితే రెండో విడత నుంచి రేషన్ కార్డు ఉంటేనే ఇందిరమ్మ ఇళ్లు పొందేందుకు అర్హులవుతారన్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచిలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆ గ్రామంలోనే నివాసం ఉండాలన్నారు. అప్పుడే స్థానిక పరిస్థితులపై పట్టు కలిగి ఉంటారన్నారు. సాధ్యమైనంత త్వరగా వారు పని చేస్తున్న గ్రామంలోనే ఉండేలా చూసుకోవాలన్నారు. గ్రామ కార్యదర్శులపై ఎంపీడీవోల అజమాయిషీ ఉండాలన్నారు. పనుల్లో నిర్లక్ష్యం వహించే కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆయా గ్రామ పంచాయతీ పరిధిలో పెన్షన్‌కు అర్హులైన వికలాంగులను గుర్తించాలన్నారు. అనర్హులకు ఎవరికీ పెన్షన్ ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. రానున్న ఏడాది కాలంలో రోడ్లు, డ్రైనేజీల సమస్య తీరుతుందని హామీ ఇచ్చారు.

# ధాన్యం కొనుగోళ్లపై ప్రతి జిల్లాకో ఐఏఎస్



- కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను సమర్థంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఉమ్మడి జిల్లాకో ఐఏఎస్‌ను ప్రత్యేక అధికారిగా నియమించింది. ఈ మేరకు రాష్ట్రంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లపై సోమవారం ఆయన అధికారులతో సమీక్ష జరిపారు.

రైతులకు ఇబ్బంది తలెత్తకుండా అన్ని జిల్లాల్లో కొనుగోళ్ల చేపట్టాలని, ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని సీఎం ఆదేశించారు. కొనుగోళ్లు జరుగుతున్న తీరును పరిశీలించి, ఏమైనా సమస్యలుంటే అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు.

**ప్రత్యేకాధికారులు:**

- ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రంభీం అసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు కృష్ణ ఆదిత్య
- కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా జిల్లాలకు ఆర్‌వీ కర్ణన్
- నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేటకు అనితా రామచంద్రన్
- నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు డా. ఏ.శరత్
- రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ మల్కాజ్?గిరి జిల్లాలకు డి. దివ్య
- మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల్ మరియు నాగర్‌కర్నూల్ జిల్లాలకు రవి
- వరంగల్, హనుమకొండ, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాలకు టి. వినయ కృష్ణా రెడ్డి
- మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు హరిచందన దాసరి
- ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు కె. సురేంద్ర మోహన్



### బాణాసంచా నిషేధాన్ని
## ఎందుకు అమలు చేయలేదు..?

- ఢిల్లీ సర్కారును ప్రశ్నించిన సుప్రీం కోర్టు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

పత్రికల్లో వస్తున్న వార్తలను చూస్తే.. ఢిల్లీలో బాణాసంచా నిషేధం అమలు కాలేదని అనిపిస్తోందని.. ఇందుకు సమాధానం చెప్పాలని ఢిల్లీ సర్కారును సుప్రీంకోర్టు ఆదేశించింది. బాణాసంచా నిషేధంపై ఢిల్లీ ప్రభుత్వం కీలక చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. దీపావళి నుంచి ఢిల్లీ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగింది. దాంతో జనం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శ్వాసకోశ సమస్యలు, కళ్లు ఎర్రబారడం, చికాకు తదితర సమస్యలతో బాధపడుతున్నారు. ప్రస్తుతం నగరంలోని చాలా ప్రాంతంలో గాలి నాణ్యత సూచి 400 మార్కుని దాటింది. పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొని డిసెంబర్ 2, 2016న ఎంసీ మెహతా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పును ఇచ్చింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఢిల్లీలో గ్రాప్ పాలసీని అమలులోకి తీసుకువచ్చారు. చలికాలంలో వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ఇందులో పలు నిబంధనలు ఉన్నాయి. ఇందులో బాణాసంచాపై నిషేధం సైతం ఉన్నది. వాయు కాలుష్యంపై ఢిల్లీ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు సోమవారం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. బాణాసంచా నిషేధాన్ని ఎందుకు అమలు చేయడం లేదని సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. నిషేధం ఉంటే పటాకులు ఎలా పేల్చారు? వీలైనంత త్వరగా సమాధానం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. దేశ రాజధాని ఢిల్లీలో వాయుకాలుష్యం పెరిగిపోవడంతో మార్నింగ్ వాక్ చేయడం మానేస్తున్నట్లు సీజేఐ చంద్రచూడ్ గురువారం వ్యాఖ్యానించారు. శ్వాసకోశ వ్యాధులను నివారించడానికి ఇంట్లోనే ఉండటమే మంచిదని, ఉదయాన్నే బయటకు వెళ్లకుండా ఉండాలని డాక్టర్ సలహా ఇచ్చారన్న ఆయన.. వాయుకాలుష్యం పెరుగుతుండడంపై ఆందోళన వ్యక్తం చేశారు.

## విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తున్నాం



- సీఎం రేవంత్ రెడ్డి
- సీఎంను కలిసిన విద్యార్థులు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

విద్యార్థినీ విద్యార్థులు చదువుల్లో ఉన్నతంగా రాణించి తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. గత పదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో డ్రాపవుట్స్‌ను తగ్గించడంలో ముఖ్యంగా యువత కృషి చేయాలని కోరారు.

ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచిన నేపథ్యంలో మంచిర్యాల నుంచి శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులు తరలివచ్చి సీఎంను జూబ్లీహిల్స్ నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వారు సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు.సీఎం వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. విద్యా వ్యవస్థను మెరుగుపరచడానికి తీసుకున్న చర్యలను వివరించారు. ప్రభుత్వ పాఠశాలు, కళాశాలలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలన్న నిర్ణయం, స్కిల్ యూనివర్సిటీ, ఐటీఐలను ఏటీసీలుగా మార్పు, స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు వంటి పలు అంశాలను తెలిపారు.

డ్రాపవుట్స్‌ను తగ్గించడానికి యువజన సంఘాలు చొరవ చూపాలని, గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాల బారిన పడొద్దని కోరారు. రాజకీయ పార్టీల రెచ్చగొట్టే ప్రకటనలను నమ్మొద్దని, విద్యార్థులు, నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని హితవు చెప్పారు.

## 8న సీఎం రేవంత్ పాదయాత్ర

- మూసీ పరిస్థితిని ప్రజలకు వివరించేందుకు..
- బీబీనగర్- వలిగొండ మధ్య 6 కి.మీ నడక

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 8న భువనగిరి జిల్లాలోని మూసీ పరివాహక ప్రాంతంలో పాదయాత్ర చేయనున్నారు. ఆ రోజు ఆయన తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కుటుంబ సమేతంగా యాదాద్రి ఆలయాన్ని సందర్శిస్తారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ గోపురానికి సంబంధించిన బంగారు తాపడం పనులను పరిశీలిస్తారు. ఆ తర్వాత వలిగొండ మండలం సంగెం నుండి ప్రారంభించి, మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటిస్తారు. ఆ నది ప్రక్షాళనకు మద్దతుగా భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నిర్వహిస్తున్న ప్రజా చైతన్య యాత్రలో సీఎం పాల్గొంటారు. వలిగొండ–బీబీనగర్ మధ్య ఆరు కిలోమీటర్ల మేర మూసీ వెంట నడుస్తూ అక్కడి కాలుష్యం పరిస్థితిని ప్రజలకు వివరించనున్నారు.

## కుల గణనకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రభుత్వం కుల గణన కోసం ప్రత్యేక డెడికేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ చైర్మన్‌గా మాజీ ఐఏఎస్ వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, హైకోర్టు ఆదేశాల మేరకే కమిషన్‌ను ఏర్పాటు చేస్తున్నామని.. నెల రోజుల్లోగా నివేదిక సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## టెట్ నోటిఫికేషన్ విడుదల

TS-TET 2024
TELANGANA STATE TEACHER ELIGIBILITY TEST

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నోటిఫికేషన్ విడుదలైంది. గత మే నెలలో తొలిసారి టెట్ పరీక్షలు జరుగగాగా, తాజాగా మరోమారు నోటిఫికేషన్ విడుదల చేసింది. వచ్చే ఏడాది జనవరిలో టెట్ నిర్వహించనున్నట్టు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. 2025 జనవరి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు కంప్యూటర్ బేస్డ్ పరీక్షను నిర్వహించనున్నారు.

టెట్ రాసేందుకు అర్హులైన అభ్యర్థులు మంగళవారం(నవంబర్ 5) నుంచి 20వ తేదీ లోపు టెట్ రాసేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఇవి నరసింహారెడ్డి వెల్లడించారు. పాఠశాల విద్యా అధికారిక వెబ్ సైట్ http://schooledu.telangana.gov.inలో మరింత సమాచారం పొందవచ్చని పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు ఆరు సార్లు టెట్ పరీక్షలు నిర్వహించగా జనవరిలో జరిగేది ఏడోసారి కానుంది.

**టెట్ రాసేందుకు అర్హత** : టెట్ పేపర్–1కు డి.ఇడి, పేపర్ –2కు బి.ఇడి పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులు. స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందేందుకు టెట్ అర్హత ఉండాలని చెబుతుండటంతో వేల మంది ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు కూడా పరీక్షకు హాజరుకానున్నారు. టెట్ ప్రవేశపెట్టిన నాటి నుంచి ఇప్పటి వరకు తొమ్మిది సార్లు పరీక్షలు నిర్వహించగా జనవరిలో పదోసారి జరగనుంది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత గత మే పరీక్షతో కలుపుకొని ఆరుసార్లు పరీక్షలు జరిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే రెండోసారి టెట్‌ను నిర్వహిస్తుండటం విశేషం.

## రాహుల్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ..

- ఆరు గ్యారంటీలకు హామీ అని ఇప్పుడెక్కడున్నారు
- రాష్ట్రంలో రెండో పులకేశి పాలన నడుస్తున్నది
- మీ సీఎం వల్ల బాధితులైన వారిని పరామర్శించే దమ్ముందా
- రాహుల్‌కే కేటీఆర్ పలు సవాళ్లు
- తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

అధికారం కోసం అడ్డగోలు హామీలిచ్చి, సబ్బండ వర్గాలకు చేసిన మోసం, అభివృద్ధి తెలంగాణను అవినీతి తెలంగాణగా మార్చినందుకు కాంగ్రెస్ పార్టీ తరపున యావత్ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీని బీఆర్ఎస్ ప్రెసిడెంట్ కెటిఆర్ డిమాండ్ చేశారు.. ఈ మేరకు రాహుల్‌కు ఆయన సోమవారం ఒక బహిరంగ లేఖ విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ రేపు నిర్వహించనున్నజనగణన కార్యక్రమంలో పాల్గొనేందుకు మంగళవారం రాహుల్ వస్తున్న సంగతి తెలిసిందే. ఈ లేఖలో కేటీఆర్..

“పదేళ్లలో ఘనంగా అభివృద్ధి చెందిన తెలంగాణకు విచ్చేస్తున్న రాహుల్ గాంధీ, పచ్చగా ఉన్న తెలంగాణ మీ ఏడాది పాలనలోనే ఏ విధంగా వందేళ్ల విధ్వంసానికి గురైందో మీ రాక సందర్భంగా ఒక్కసారి మీకు గుర్తు చేయదలుచుకున్నాను.

మిగితా 3వ పేజీలో



## పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచుల ఆందోళన

- అరెస్టు చేసి తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు
- అక్కడ వారికి మద్దతుగా హరీశ్‌రావు నిరసన

వివరాలు 3వ పేజీలో



## ఉత్తరాఖండ్‌లో లోయలో పడిన బస్సు



బలగం టీవి, డెహ్రాడూన్

ఉత్తరాఖండ్‌లోని అల్మోరా జిల్లాలో మర్చులా సమీపంలో సోమవారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. 42 మంది ప్రయాణికులతో వెళుతున్న బస్సు అదుపు తప్పి లోయలో పడిపోయింది. ఈ ఘటనలో 36 మంది ప్రాణాలు కోల్పోయారు. కిరత్ నుండి రామ్‌నగర్ వెళుతుండగా బస్సు ప్రమాదానికి గురైందని అధికారులు చెప్పారు. సహాయ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నదని జిల్లా విపత్తు నిర్వహణ అధికారి వినీత్ పాల్ అన్నారు. బస్సు 150 మీటర్ల లోయలో పడిపోయిందని ఉదయం 8.45 గంటలకు జిల్లా అధికారులకు సమాచారం అందింది. ఆ వెంటనే ధూమల్‌కోట్ నుండి స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందం హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని సహాయ కార్యక్రమాలు చేపట్టింది. కాగా ఈ ఘటనకు సంబంధించి కొందరు అధికారులను సస్పెండ్ చేశామని ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ తెలిపారు. మృతుల కుటుంబాలకు నాలుగు లక్షల రూపాయలు, గాయపడిన వారికి లక్ష రూపాయల చొప్పున పరిహారం ప్రకటించారు. ప్రమాదంపై మెజిస్టీరియల్ విచారణ ప్రారంభించాల్సిందిగా ఆదేశించారు. ‘ఇది చాలా విచారకరమైన వార్త. సహాయ, పునరావాస చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించాము. ప్రమాదంలో గాయపడిన వారిని సమీపంలోని ఆస్పత్రులకు తరలిస్తున్నారు. అవసరమైతే తీవ్రంగా గాయపడిన వారిని విమానాలలో తరలించాలని ఆదేశించాము’ అని ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో తెలిపారు.


## ఆదాయ మార్గాలను అన్వేషించండి

- జాయింట్ వెంచర్‌లో ఉన్న వివాదాలను తర్వగా పరిష్కరించండి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- ఆదాయ వనరులపై సమీక్ష

వివరాలు 3వ పేజీలో

## జమ్ముకశ్మీర్ అసెంబ్లీలో తొలి రోజు రసాభాస

370 రద్దును వ్యతిరేకిస్తూ తీర్మానాన్ని ప్రవేశపెట్టిన పీడీపీ ఎమ్మెల్యే
అభ్యంతరం చెబుతూ బీజేపీ ఎమ్మెల్యేలు ఆందోళన



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

జమ్ముకశ్మీర్ అసెంబ్లీ సమావేశాలు తొలిరోజు రసాభాస చోటు చేసుకుంది. సోమవారం జరిగిన సమావేశంలో పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పీడీపీ) ఎమ్మెల్యే పర్రా ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకిస్తూ తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. ఆ తీర్మానంపై అభ్యంతరం చెబుతూ బీజేపీ సభ్యులు ఆందోళన తెలియజేశారు. అయితే అధికారిక నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీకి చెందిన స్పీకర్ రహీమ్ రాథర్ మాట్లాడుతూ అటువంటి తీర్మానాన్ని తానింకా అంగీకరించలేదని చెప్పారు. దీంతో అసెంబ్లీలో గందరగోళం నెలకొంది. 2019 లో జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసిందే. జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370 ని రద్దు చేయడంతో 2019 లో ప్రత్యేక ప్రతిపత్తి హెూదాను కోల్పోయింది. దీంతోపాటు ఆ రాష్ట్రం రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడిపోయింది. జమ్ముకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హెూదా కల్పించాలని ఫరూక్ అబ్దుల్లా నేతృత్వం లోని నేషనల్ కాన్ఫరెన్స్ డిమాండ్ చేస్తోంది. ఒమర్ అబ్దుల్లా కూడా గత ఐదేళ్లుగా అందుకోసమే తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్‌సీకాంగ్రెస్ కూటమి విజయం సాధించింది. 90 స్థానాల శాసన సభలో ఎన్‌సీ 42 సీట్లలో , కాంగ్రెస్ 6 స్థానాల్లో నెగ్గాయి. నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హెూదాను పునరుద్ధరించాలని కేంద్రాన్ని కోరుతూ ఇటీవల ఒమర్ మంత్రివర్గం తీర్మానం చేసిన సంగతి తెలిసిందే. దానికి లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆమోదం కూడా తెలిపారు. ఈ పునరుద్ధరణ ప్రక్రియను ప్రారంభించే యోచనలో కేంద్రం ఉందని, ఈమేరకు హామీ లభించిందని పలు మీడియా కథనాలు వెలువడ్డాయి.



## వరదవెల్లిలో అందుబాటులోకి బోట్ సేవలు..

- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

**బలగం టీవీ ,బోయినపల్లి:**

బోయినిపల్లి మండలం వరదవెల్లిలోని దత్తాత్రేయ స్వామి ఆలయానికి వెళ్లే భక్తులకు బోట్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చామని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు . బోయినిపల్లి మండలం వరదవెల్లి లో నిస్థానిక గ్రామ దేవత పోచమ్మ తల్లిని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సోమవారం దర్శించుకున్నారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి బోట్ సేవలను ప్రారంభించారు. కలెక్టర్ సందీప్ కుమార్ తోపాటు స్వయంగా బోట్ లో వెళ్లి దత్తాత్రేయ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బోట్ సేవలు అందుబాటులోకి రావడంవల్ల ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని అన్నారు.అందరూ దత్తాత్రేయ స్వామిని దర్శించుకోవడంతోపాటు ప్రతి ఒక్కరూ స్వామి వారి ఉత్సవాల్లో సంతోషంగా పాల్గొనే అవకాశం లభించిందనిఅన్నారు .

# త్వరలోనే రైతు భరోసా పంపిణీ చేస్తాం..

**-సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే పత్తిని విక్రయించాలి.**

**-పత్తి రైతులు ప్రభుత్వ మద్దతు ధర పొంది ఆర్థికంగా బలపడాలి..**

**-ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పత్తిని సిసిఐ కొనుగోలు కేంద్రాల్లోని విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని పత్తి రైతులు ఆర్థికంగా బలపడాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ అర్బన్ మండలం నాంపల్లి, సంకేపల్లి, కోనరావు పేట మండలం సుద్దాలలో ఏర్పాటుచేసిన సిసిఐ. పత్తి కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ల తో కలిసి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ పత్తి రైతులు దళారు లకు తమ పంటను విక్రయించవద్దని అన్నారు .ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు జిల్లాలో ఇప్పటికే 200 పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, తేమ శాతం సరిగ్గా ఉన్న ధాన్యాన్ని సేకరిస్తున్నామని అన్నారు . అలాగే ధాన్యం నిల్వలకు సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ఆపేరల్ పార్క్ వద్దన్న గోదాములను పరిశీలించామని అన్నారు . రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే దాదాపు రూ. 18 వేల కోట్ల రుణమాఫీ చేసిందని తెలిపారు. మిగతా రైతులకు కూడా సాంకేతిక సమస్యలతో రుణమాఫీ నిలిచిపోయిన వారి సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు .

రైతు భరోసా కూడా త్వరలోనే పంపిణీ చేయనున్నామని తెలిపారు. జిల్లాలో పత్తి పండించిన రైతులు 8 నుంచి 12 శాతం తేమతో తమ పరిధిలోని సీసీఐ కొనుగోలు కేంద్రాలకు పత్తిని తరలించి విక్రయించాలని అన్నారు .ఎన్ని శాతం తో ఏమన్నా పత్తి క్వింటాల్ కు 7,521 రూపాయలు, అలాగే 8 నుంచి 12 శాతం లోపు ఉన్న పత్తికి 7,200 నుంచి 7,445 మద్దతు ధరగా సీసీఐ నిర్ణయించిందని తెలిపారు. దీంతో రైతులకు తూకం విషయంలో అలాగే డబ్బుల విషయం లో ఎలాంటి ఇబ్బందులు ఉండవని అన్నారు . అలాగే ఇల్లంతకుంట మండలంలో సిసిఐ ఆధ్వర్యంలో రెండు పత్తికొండ కేంద్రాలు ప్రారంభిస్తామని అన్నారు . రైతులు రైతులను రాజుగా చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని అన్నారు . ఈ సీజన్ ముగిసిన తర్వాత రైతుల పొలాలలోని మట్టి పరీక్షలు చేయించి దానికి అనుగుణంగా విత్తనాలు ఎంపిక, ఎరువుల వాడకం త్వరలో చేయిస్తామని అన్నారు . ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాష్, సిసిఐ అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి..

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

**బలగం టీవీ , సిరిసిల్ల**

ప్రజావాణిలో వచ్చే సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లోని ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించి, ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ . ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును నిర్ణీత సమయానికి పరిష్కరించాలని సూచించారు.





## ప్రభుత్వ పథకాలు, పరిసరాల పరిశుభ్రతపై సాంస్కృతిక సారథుల కళా ప్రదర్శన

**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం రేగులపల్లె గ్రామంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి పొత్తూరి రాజు కళా బృందం కళా ప్రదర్శన ఇచ్చారు.తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పాట,మాట ద్వారా చక్కని కళా ప్రదర్శన ఇచ్చారు.అదేవిధంగా గ్రామంలో ఉన్నటువంటి ప్రతి ఒక్కరు కూడా గ్రామపంచాయతీ సిబ్బందికి తడి, పొడి చెత్తను వేరువేరు చేసి గ్రామపంచా సిబ్బందికి అందించాలని, అదేవిధంగా పరిసరాల పరిశుభ్రత సీజనల్ వ్యాధులపై చక్కని పాటలు పాడి ప్రజలను చైతన్య పరిచారు. అదేవిధంగా సీజనల్ వ్యాధులు పట్ల ప్రతి ఒక్కరు తగు జాగ్రత్తగా ఉండాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.స్వచ్ఛదనం పచ్చదనంపై గ్రామ ప్రజలకు పాటల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారథి వేములవాడ టీం లీడర్ పొత్తూరి రాజు, కళాకారులు గడ్డం దేవయ్య, పూడూరు సంజీవ్ అంతర్పుల ఝాన్సీ లావణ్య, కిన్నర, శ్రీలత, అనుముల శిరీష మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవు



- మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దు
- ఎస్పీ అఖిల్ మహాజన్

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల :**

ర్యాగింగ్ చేయడం నేరమని, ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని,తోటి విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తించడం,వారిని ఇబ్బందులకు గురి చేయడం మంచి విద్యార్థి లక్ష్యం కాదు అని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణ పరిధిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో మహిళల రక్షణ,ఈవ్ టీజింగ్,ర్యాగింగ్, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలపై విద్యార్థిని విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా ఎస్పీ అఖిల్ మహాజన్ హాజరై, మాట్లాడుతూవిద్యార్థిని విద్యార్థులు ర్యాగింగ్, గంజాయి, డ్రగ్స్ లాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉత్తమ డాక్టర్లుగా ఎదిగి జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలకు మంచి పేరు తీసుకరావలన్నారు. విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేసి ర్యాగింగ్ మొదటి దశలోనే కట్టడి చేయాలని,కలశాల యాజమాన్యాలు విద్యార్థుల అలవాట్లను, నడవడికను ఎప్పటికప్పుడు గమనించాలని అన్నారు .విద్యార్థులు సీనియర్స్, జూనియర్స్ అనేది లేకుండా స్నేహపూర్వకంగా కలిసి మెలిసి విద్యనభ్యసించి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలనిఅన్నారు . ర్యాగింగ్ కు పాల్పడే వారి వివరాలను డయల్ 100 కు తెలియజేసి సమాచారం అందించాలన్నారు.గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలాంటి వ్యసనాలకు బానిసై విద్యార్థులు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలనిఅన్నారు . విద్యార్థినిలు మహిళలు మౌనం విడి ముందుకు వచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని,నిర్భయంగా ముందుకు వచ్చి మీ సమస్యలను చెప్పుకున్నాప్పుడే మరింత భద్రత కల్పించగలువుతామని,మహిళలు,విద్యార్థినిలు జిల్లా షీ టీమ్ నెంబర్ 8712656425 కు పిర్యాదుచెయ్యాలని అన్నారు.పిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని అన్నారు.ఈ సమావేశంలో డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, కళాశాల యాజమాన్యం, విద్యార్థిలు పాల్గొన్నారు.

## జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడి గా జిల్లా వెంకట్రాములు...,

**బలగం టీవీ,సిరిసిల్ల**

జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షుడి గా బిల్లా వెంకట్రాములు, ప్రధాన కార్యదర్శి భైరగోని గోపి, జిల్లా కార్యదర్శి ఎడ్ల నరేందర్ లను ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షులు మ్యాకల పర్శరాములు తెలిపారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షులు మ్యాకల పర్శరాములు మాట్లాడుతూ బీసీ హక్కుల కోసం విద్య, ఉద్యోగాల్లో, రాజకీయంగా జరుతున్న అన్యాయాన్ని ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ పోరాటం చేసి బీసీ హక్కులను సాదించుకోవాలిసిన అవసరం ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా బీసీ సంఘం నాయకులు లోకం వెంకటేష్,వేముల మహేష్, జక్కని చిరంజీవి, సుమన్, షార్పొద్దీన్, గాజుల మోహన్, బోనాల రవి, స్వామి తదితరులు పాల్గొన్నారు

# అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలి




- **పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా కృషి చేయాలి..**
- **గంభీరావుపేట్ పోలీస్ స్టేషన్ అధికారులు,సిబ్బంది పనితీరు బేష్**
- **ఎస్పీ అఖిల్ మహాజన్..,**

**బలగం టీవీ, గంభీరావుపేట**

గంజాయి అక్రమ రవాణా, సేవించడం వంటి వాటిపై ,అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచుతూ కట్టడి చెయ్యాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం వార్షిక తనిఖీల్లో భాగంగా గంభీరావుపేట పోలీస్ స్టేషన్ ను ఎస్పీ అఖిల్ మహాజన్ తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, స్టేషన్ రికార్డ్స్ ,వర్టికల్స్ అమలు తీరు,స్టేషన్ లో విధులు నిర్వహించే సిబ్బంది కిట్ ఆర్టికల్స్, పెండింగ్లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల సిడి ఫైల్స్ లను తనిఖీ చేసి స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహజన్ మాట్లాడుతూ గంభీరావుపేట్ పోలీస్ స్టేషన్ అధికారులు,సిబ్బంది పనితీరు బేష్ అని అన్నారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుల విషయంలో వెంటనే స్పందించి, విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. అధికారులు,సిబ్బందికి అంకిత భావంతో విధులను నిర్వర్తించాలన్నారు.నేరాల నియంత్రణకై పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలని,విలేజ్ పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని గ్రామాల్లో తరచు పర్యటిస్తూ ప్రజలతో సస్సబంధాలు కలిగి ఉండాలని, గ్రామాలకు సంబంధించిన పూర్తి సమాచారం విపివో ల దగ్గర ఉండాలని ఏదైనా సంఘటనలు జరిగితే వెంటనే ఉన్నత అధికారులకు తెలియజేయాలన్నారు. బ్లూ కోల్ట్ సిబ్బంది డయల్ 100 కాల్ రాగానే వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని సమస్యలు పరిష్కరించాలని, రాత్రి సమయాల్లో విధులు నిర్వర్తించే బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బంది పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత నేరస్తులు, సస్పెక్ట్ లు, రౌడీ షీటర్లపై నిఘాను ఉంచాలన్నారు. ఈ కార్యక్రమం లో డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సిఐ శ్రీనివాస్, ఎస్ఐ శివకుమార్ సిబ్బంది ఉన్నారు.



# పెండింగ్ బిల్లుల పోరు బాటకు తరలిన మాజీ సర్పంచుల అరెస్ట్

**బలగం టీవీ , తంగళ్ళపల్లి**

సర్పంచ్ ల పెండింగ్ బిల్లుల సాధనకై చలో హైదరాబద్ పోరుబాట కు వెళ్తున్న సర్పంచ్ లను అరెస్టు చేసి తంగళ్లపల్లి పోలీసుస్టేషన్కు తీసుకెళ్లారు. గత మూడు నెలలుగా శాంతియుతంగా చేస్తున్న కార్యక్రమాలకు ప్రభుత్వం స్పందించకపోవడంతో నీరసన కార్యక్రమాలకు పిలుపు నివ్వగా అందులో భాగంగా చలో హైదరాబాద్ పోరుబాట కు బయలు దేరారు. ఇందులో పెండింగ్ బిల్లుల సాధన సమితి జేఏసీ ఉపాధ్యక్షురాలు గణప శివజ్యోతి, జేఏసీ కార్యదర్శి వలకొండ వేణుగోపాల్ రావు, తాడూర్ సర్పంచ్ సురభి సరిత, పద్మ నగర్ సర్పంచ్ ముడారి పోచయ్య, అంకుశాపూర్ సర్పంచ్ కొయ్యడ ఎల్లవ్వ నాంపెల్లి, చింతలటనా సర్పంచ్ ఉమరాజు, చిర్లవంచ సర్పంచ్ రవీందర్, రాళ్లపేట సర్పంచ్ పర్శరాములు, వేణుగోపాలపూర్ సర్పంచ్ కాయతి బాలయ్య, ఓబుళపూర్ సర్పంచ్ నందగిరి నర్సయ్య వున్నారు.

# ఆదాయ మార్గాలను అన్వేషించండి

- **ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ప్రజలపై భారం పడకుండా ఆదాయాన్ని పెంచే మార్గాలపై అధికారులు దృష్టి పెట్టాలని డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర ఆదాయ వనరుల సమీకరణ మంత్రివర్గ సమావేశం జరిగింది. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ జాయింట్ వెంచర్స్‌లో విలువైన ఆస్తులు ఉన్నాయనీ, ప్రయివేటు వ్యక్తులు న్యాయస్థానాలకు వెళ్లి వివాదాలు సృష్టించి, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని అభిప్రాయపడ్డారు. జాయింట్ వెంచర్స్ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ ప్రత్యేక



ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు అధ్యక్షతన మున్సిపల్, హౌసింగ్, న్యాయశాఖ కార్యదర్శితో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. వారంలోగా ఈ కమిటీ జాయింట్ వెంచర్ల సమస్యలకు పరిష్కారాలు చూపుతూ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

తమకు ప్రోత్సాహకాలు అందిస్తే నగరం విడిచి ఔటర్ రింగ్ రోడ్డు వెలుపలకు వెళతామని వివిధ పరిశ్రమల నిర్వాహకులు చెబుతున్నారని, అదే జరిగితే నగరంలో కాలుష్యం కూడా తగ్గుతుందన్నారు. కాబట్టి వారి విజ్ఞప్తులను పరిశీలించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు బయట పరిశ్రమలను స్థాపించుకునేలా ప్రోత్సాహకాలు ఉండాలన్నారు. పురపాలకశాఖ ఆధ్వర్యంలో నిరంతర ప్రక్రియ గా జరిగే ప్లాట్ల బహిరంగ వేలంపై మంత్రివర్గ ఉపసంఘం అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంది. భూముల వేలాన్ని పటిష్టంగా నిర్వహించి ప్రభుత్వ ఖజానాకు అధిక ఆదాయం సమకూర్చాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. రాజీవ్ స్వగృహ పెండింగ్ ప్లాట్లపై కూడా మంత్రివర్గ ఉపసంఘం సమీక్ష నిర్వహించింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఐదెకరాల విస్తీర్ణంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటు కోసం ఇండస్ట్రియల్ పార్కులు నిర్మించాలని పరిశ్రమల శాఖ అధికారులకు చెప్పారు. దీనివల్ల గ్రామీణ యువతకు ఉద్యోగ అవకాశాలు, ఆర్థిక చేయూత లభిస్తాయని అన్నారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కే రామకృష్ణారావు, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్ పాల్గొన్నారు.



# పట్టభద్రుల ఓటర్ నమోదు గడువును పెంచాలి

- **ఆత్మీయ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్**

**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆత్మీయ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ: తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగనున్న కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల ఎన్నికల ఓటర్ నమోదు గడువు కార్యక్రమాన్ని పెంచాలని ప్రధాన ఎన్నికల అధికారిని ఒక ప్రకటనలో కోరారు. పట్టభద్రుల ఓటర్ నమోదు కార్యక్రమం ప్రారంభమై చాలా రోజులు గడుస్తున్నప్పటికీ ఇంకా కూడా కొంతమంది పూర్తిస్థాయిలో ఓటరుగా నమోదు చేసుకోలేదని, ఓటర్ నమోదు శాతాన్ని పెంచే విధంగా ఉండేందుకు గడువును నవంబర్ 6 నుండి మల్లి పెంచాలని కోరారు . ఈ కార్యక్రమంలో నాయకులు వేణు యాదవ్, జగదీష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ..

- **రాహుల్‌కే కేటీఆర్ పలు సవాళ్లు**
- **తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్**

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికలకు ముందు తెలంగాణలో ఏ పిల్లాడికి కూడా కష్టమొచ్చిన సరే ఇలా పిలుస్తే అలా వస్తానని చెప్పి తీరా గద్దెనెక్కిన తర్వాత మా ప్రజల గొంతును తడిగుడ్డతో కోశారు.

రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆటోడ్రైవర్లు, చేనేత కార్మికులు, మూసీ, హైడ్రా బాధితులు ఇలా ఒక్కరంటే సమాజంలో అన్ని వర్గాలను నయనంచనకు గురిచేశారు.

ఒక్కటంటే ఒక్క మాట కూడా నిలబెట్టుకోకుండా ప్రజలను మోసం చేశారు. మీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను హింసించే పులకేసి మాదిరిగా హింసిస్తుంటే ఏమీ తెలియనట్లుగా నటిస్తూ ఢిల్లీలో గప్ చుప్ అయిపోయారు. అధికారంలో వచ్చిన మరుసటి రోజు నుంచే మీ నయవంచన స్వరూపం ఎలా ఉంటుందో ప్రజలకు రుచి చూపించారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అంటూ ఊదరగొట్టిన మీరు మూడు వందల రోజులు దాటినా సరే వాటిని అమలు చేయటం చేతకాక చేతులేత్తేశారు.

కాంగ్రెస్ కబంధ హస్తల్లో చిక్కుకొని తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు విలవిలలాడుతోంది. అభయ హస్తం అని నమ్మబలికి భస్మాసుర హస్తంతో తెలంగాణ ప్రజలను నిండా ముంచారు. ఒక్కటా, రెండా ఈ ఏడాదిలో మీ పార్టీ పాలన వైఫల్యాలు చిత్ర గుప్తుడి చిట్టా అంతా ఉన్నాయి.నమ్మించి మోసం చేయటమనే నైజం కాంగ్రెస్ పార్టీ నరనరాల్లోనే ఉంది. ఆరు గ్యారంటీలు, అభయ హస్తం అంటూ ఇక్కడి ప్రజలను మోసం చేసేందుకు ముందుగా ఢిల్లీ నుంచి వచ్చి నాంది పలకింది మీరే. యథా రాజా తథా ప్రజా అన్నట్లు ఆ తర్వాత మీ బాటలోనే ఇక్కడి నాయకులు నడుస్తున్నారు. ఆరు గ్యారంటీల అమలు బాధ్యత నాది అని చెప్పిన మీరు... అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటువైపు తొంగి కూడా చూడలేదు. 3 వందల రోజులైనా ఒక పరిమిత ఉచిత బస్సు మినహా ఒక్క గ్యారంటీని అమలు చేయలేని అసమర్థత మీది. రైతులకు రుణమాఫీ అని చెప్పి సగం మందికి కూడా రుణాలు మాఫీ చేయలేదు. కానీ మీ జాతీయ కాంగ్రెస్ పార్టీ ట్విట్టర్ లో మాత్రం పూర్తి రుణమాఫీ చేసేశా మంటూ సిగ్గులేకుండా అబద్ధాలను ప్రచారం చేసుకున్నారు. ఒక్క రుణమాఫీయే కాదు రైతు భరోసాను ఎత్తగొట్టారు. బోనస్‌ను బోగస్ చేశారు.

కనీసం రైతులు పండించిన పంటను కూడా కొనుగోలు చేయలేని దద్దమ్మల మాదిరిగా తయారయ్యారు. అన్ని వర్గాల సంక్షేమ మా బాధ్యత అంటూ ఎన్నికల కు ముందు పెద్ద పెద్ద మాటలు చెప్పారు. కానీ ఇప్పుడు అన్ని వర్గాల సంక్షేమాన్ని నాశనం చేసే పనిని విజయవంతంగా కొనసాగిస్తున్నారు. నిరుద్యోగులు, విద్యార్థులు, రైతులు, అంగన్ వాడీలు, పోలీసులు ఇలా అన్ని వర్గాల వాళ్ళ ప్రతి రోజు రోడ్లపై ధర్నాలు, నిరసనలు చేసే పరిస్థితికి తీసుకొచ్చారు." అని పేర్కొన్నారు.

# పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచుల ఆందోళన


**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పోరుబాట పేరుతో చలో హైదరాబాద్‌కు తరలివచ్చిన మాజీ సర్పంచులను పోలీసులు పలుచోట్ల అదుపులోకి తీసుకున్నారు. సోమవారం బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో సర్పంచుల సంఘం జేఏసీ నేతలు సమావేశమయ్యారని తెలుసుకుని అక్కడకెళ్లి వారిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్, ఉపాధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, రేపాక నాగయ్య, గుర్రాలదండి ఆంజనేయులు, దుంప ఆంజనేయులుతో పాటు పలువురు అక్కడే కూర్చొని నిరసన తెలిపే యత్నం చేశారు. అయితే పోలీసులు వారిని అరెస్టు చేసి నగరంలోని తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మద్దతు తెలిపిన హరీశ్‌రావు

విషయం తెలుసుకున్న హరీశ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు పీఎస్ వద్దకు చేరుకుని వారికి మద్దతుగా ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ... మాజీ సర్పంచ్‌లను అరెస్ట్ చేసి నిర్బంధించడం దుర్మార్గమైన చర్య అన్నారు. అర్ధరాత్రి పూట దొంగలను, టెర్రరిస్టులను అరెస్ట్ చేసినట్లు మాజీ సర్పంచ్‌లను అరెస్ట్ చేయడమేమిటని ప్రశ్నించారు. అప్పులు చేసి, భార్య పిల్లల ఒంటి మీదున్న మీద బంగారం అమ్మి మరీ వారు పనులు చేశారన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు ఎంతో కృషి చేశారని ప్రశంసించారు. ఉత్తమమైన గ్రామాలకు తెలంగాణ కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందన్నారు. ఆయా గ్రామాలు అవార్డులు సాధించాయంటే అందులో సర్పంచ్‌ల పాత్ర ఎంతో ఉందన్నారు. గ్రామాలకు మంచి పనులు చేసిన మాజీ సర్పంచ్‌లకు శిక్ష ఎందుకు వేస్తున్నారో సీఎం చెప్పాలని నిలదీశారు కార్యక్రమంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడి తదితరులు ఉన్నారు.

# అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..



● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్..

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి లక్ష్యంగా, నిరుపేదల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కే కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన సమగ్ర కులగణన ఇంటింటి సర్వే అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ పిలుపు మేరకు సమగ్ర కుల గణన ఇంటింటి సర్వే పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని అన్నారు.రాహుల్ గాంధీ పిలుపు మేరకు కులగణనకు గత ఎన్నికల్లో పిలుపునిచ్చారు అని,కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి రాగానే కులగణన చేపడుతామని ఇచ్చిన హామీ ప్రకారం కులగణన చేస్తున్నామని అన్నారు. మూడు నెలల్లో కులగణన పై హైకోర్టుకు నివేదిక సమర్పిస్తామని అన్నారు. అన్ని వర్గాల వారు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలపై మీ సలహాలు సూచనలు ఇవ్వాలని అన్నారు.

రాష్ట్రంలోని 80 వేల మంది అధికారులతో సర్వే చేస్తున్నామని,50 ప్రశ్నలతో ఒక్క అధికారికి 150 ఇల్లులు చొప్పున కేటాయిస్తున్నామని అన్నారు. గ్రామాల్లో ఉన్న కాంగ్రెస్ నాయకులు అధికారులకు సహాయ సహకారాలు అందించాలని,ప్రతి ఒక్కరూ పాల్గొని పండుగ వాతావరణంలో కుల గణన జరగాలని అన్నారు. కుల గణన ఆధారంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్నాయని, రాజకీయాలకతీతంగా కుల గణన చేస్తున్నామని అన్నారు.

2014 లో 16 వేల కోట్ల నిల్వవతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సోనియమ్మ ఇచ్చింది అని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయినప్పుడు 60 వేల కోట్లు కు అప్పుడు సంవత్సరానికి 6 వేల కోట్ల రూపాయలు మిత్తి కట్టేది అని,గత ప్రభుత్వం చేసిన 7 లక్షల కోట్ల అప్పుకు కడుతున్న మిత్తి నెలకు 6 వేల కోట్ల రూపాయలు అని అన్నారు. రైతు రుణమాఫీ మొదటి, రెండో విడుత లో 36 వేల కోట్ల రూపాయలు మాఫీ చేసామని, ఆధార్ కార్డులో తప్పుడు ఉండడం వలన కొందరి రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ కాలేదు, త్వరలో వారికి కూడా రుణ మాఫీ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, పిసిసి సీనియర్ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం, నాయకులు సంగీతం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



● కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ

**బలగం టీవీ , సిరిసిల్ల :**

ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ సూచించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూరు వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)నీ కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఎనిమిది, తొమ్మిది తరగతులు కొనసాగుతూ ఉండగా తరగతి గదుల్లోకి వెళ్లి ఉపాధ్యాయుల బోధనను పరిశీలించారు 8వ తరగతిలో ఇంగ్లీషు పాఠ్యాంశాన్ని ఉపాధ్యాయురాలు బోధిస్తుండగా తరగతి గదిలో కలెక్టర్ కూర్చుండి పరిశీలించారు. పలువురు విద్యార్థులతో ఇంగ్లీష్ పాఠ్యాంశాలు చదివించారు అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్ సోషల్ తదితర అంశాలపై పట్టు సాధించేలా ప్రతిరోజు చదివించడం రాయించడం చేయాలని కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ పావని కి సూచించారు.

# బండి సంజయ్ తిట్ల పురాణం బంద్ చేసి రోడ్లపై దృష్టి పెట్టండి..

● మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్

**బలగం టీవీ , సిరిసిల్ల**

బండి సంజయ్ తిట్ల పురాణం పక్కనపెట్టి, జాతీయ రహదారుల నిర్మాణాలపై దృష్టి పెట్టాలని మాజీ తెలంగాణ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ మాజీ ఎంపీ బోయిన పల్లి వినోద్ కుమార్ అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణంలోని తెలంగాణ భవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వినోద్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ద్వారా ఏర్పాటయిందని, స్వతంత్రం వచ్చినప్పటినుండి తెలంగాణకు జరిగిన నష్టాన్ని పూడ్చడానికి విభజన చట్టంలో కొన్ని హామీలు ఇచ్చారని అన్నారు.

తెలంగాణలో 365 సూర్యపేట జనగామ దుద్దెడ వరకు జాతీయ రహదారిని మా ప్రభుత్వం లో ప్రతిపాదించాము, ఆ నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయని అన్నారు. ఎలుకతుర్తి నుండి సిద్దిపేట మీదుగా మెదక్ వరకు ఒక జాతీయ రహదారి, కరీంనగర్ నుండి వేములవాడ సిరిసిల్ల కామారెడ్డి మీదుగా పిట్లం వరకు మరో జాతీయ రహదారిని ప్రతిపాదించామని అన్నారు. సిద్దిపేట నుండి సిరిసిల్ల వరకు రోడ్డు 36 వంకరలు తిరిగిందని దాని దృష్టిలో పెట్టుకొని సిద్దిపేట నుండి సిరిసిల్ల వరకు 365 బి జాతీయ రహదారిని పెంచాలని ప్రపోజల్ పంపామని అన్నారు. అదే జాతీయ రహదారిని సిరిసిల్ల నుండి కోరుట్ల వరకు పెంచాలని ప్రపోజల్ పంపించడం కూడా జరిగిందన్నారు. బండి సంజయ్ ఐదు సంవత్సరాలు ఎంపీగా, ప్రస్తుతం కేంద్ర మంత్రిగా ఉన్నాడని 365 బి సిరిసిల్ల నుండి కోరుట్ల వరకు ప్రపోజల్ చివరి దశలో ఉన్నదని, వెంటనే బండి సంజయ్ 365 బి జాతీయ రహదాన్ని సిరిసిల్ల నుండి కోరుట్ల వరకు ఆమోదింప చేయాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల నుండి కోరుట్ల కు నిర్మించే రహదారిని తంగళ్ళపల్లి అవతల నుండి రైల్వే లైన్ కు సమానంగా నిర్మించాలని అన్నారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో మిడ్ మానేరు పై రాజమండ్రి తరహాలో రైల్వే రైల్వే లైన్ రోడ్ బ్రిడ్జి నిర్మించాలని, ఆ విధముగా ప్రపోజల్ పంపి, జాతీయ రహదారి నిర్మించాలని అన్నారు. బండి సంజయ్ వెంటనే జాతీయ రహదారి ప్రతిపాదనను ఆమోదింప చేయాలని డిమాండ్ చేశారు. దుద్దెడ నుండి సిరిసిల్ల వరకు నిర్మించే జాతీయ రహదారిని సిరిసిల్ల పట్టణం నుండి కాక పక్కన తీసుకువెళ్లాలని అన్నారు. వెంటనే బండి సంజయ్ జాతీయ రహదారులను ప్రతిపాదనను ఆమోదింప చేయాలని లేని పక్షంలో ఉద్యమాలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాఫ్స్ కాబ్ చైర్మన్ కొండూరి రవీందరావు, టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య,సెస్ చైర్మన్ చిక్కాల రామారావు,సిరిసిల్ల మున్సిపల్ చైర్మన్ జిందం కళా చక్రపాణి, నాయకులు గూడూరు ప్రవీణ్, తుల ఉమా, ఏనుగు మనోహర్ రెడ్డి, జిందం చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

# అప్పెరల్ పార్కు గోదాములలో ధాన్యం నిల్వకు చర్యలు



-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని అప్పెరల్ పార్కు గోదాములలో నిల్వ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులకు సూచించారు. శనివారం ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ రాజన్న సిరిసిల్ల జిల్లాలో ధాన్యం నిల్వ చేసేందుకు అనుకూలంగా ఉన్న గోదాములను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో రైతుల వద్ద నుంచి ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2024 లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని భద్రపర్చేందుకు ఇంటర్మీడియట్ గోదాములను పరిశీలించామని, కొనుగోలు చేసిన ధాన్యం నిల్వ చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ అప్పెరల్ పార్క్ గోదాములలో 3 లక్షల మెట్రిక్ టన్నులకు పైబడి నిలువ చేసే సామర్థ్యం కలదని అన్నారు .

# లైంగిక వేధింపులు, పోక్సో చట్టాలపై అవగాహన



**బలగం టీవీ ,తంగళ్లపల్లి**

తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాల మరియు రామన్న పల్లె లో విద్యార్తినిలకు లైంగిక నేరాలు, పోక్సో చట్టాల మరియు అంగన్వాడి పిల్లలకి పౌష్టికాహారము పెరుగుదలను దోహదం చేసే అంశాలను గురించి ఎంఈఓ భూక్య రాజు నాయక్ వివరించారు.రామన్న పల్లె లో జిల్లా చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ పరమేశ్వర్ హాజరయ్యి మాట్లాడుతూ మహిళలపై ఎలాంటి నేరాలు జరిగినా1098 చైల్డ్ హెల్ప్ లైన్ కి కాల్ చేసి కంప్లైంట్ ఇవ్వాల్సిందిగా తెలిపారు. పోలీస్ శాఖ తక్షణమే స్పందిస్తుందని అలాగే బాల బాలికలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి అవగాహన ఉన్నట్లయితే లైంగిక నేరాలను పోలీసుల దృష్టికి తీసుకురావడం జరుగుతుందని వాటి గురించి వివరించారు.మహిళలపై ఎలాంటి నేరాలు జరిగిన 1098 చైల్డ్ హెల్ప్ లైన్ కి కాల్ చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్ కుమార్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయండి..



**సీపీఎం సిరిసిల్ల జిల్లా కార్యదర్శి ముశం రమేష్**

**బలగం టీవీ , సిరిసిల్ల :**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఈ నెల 19 20 తేదీల్లో నిర్వహించే సిపిఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సిపిఎంజిల్లా కార్యదర్శి ముశం రమేష్ పిలుపునిచ్చారు. శనివారం సిరిసిల్ల పట్టణంలో ని కామ్రేడ్ అమృత్ లాల్ శుక్ల కార్మిక భవన్లో సిపిఎం జిల్లా మహాసభల కరపత్రంను సిపిఎం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ము శం రమేష్ మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాలో సిపిఎం కార్మిక కర్షక బడుగు బలహీన వర్గాల ప్రజా సమస్యలపై పోరాడుతున్న సిపిఎం పార్టీ జిల్లా మహాసభలు నవంబర్ 19 20 తేదీల్లో సిరిసిల్ల పట్టణంలో ని బి వై నగర్ షాదీ ఖానా ఫంక్షన్ హాల్ లో రెండు రోజులపాటు నిర్వహించడం జరుగుతుందని అన్నారు.ఇట్టి మహాసభల జయప్రదానికి జిల్లాలోని ప్రజలందరూ ఆర్థిక హార్థిక సహాయ సహకారాలు అందించాలని అన్నారు.

సిపిఎం పార్టీ జిల్లాలో ఇల్లు లేని నిరుపేదల కోసం డబుల్ బెడ్ రూమ్ ఇవ్వాలని, రైతులకు మద్దతు ధర, దళితులపై మహిళలపై జరిగిన దౌర్జన్యాలు,పవర్లూమ్, బీ డి కార్మికుల,హమాలి, ఆశ, ఉపాధి హామీ కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహిస్తూ వస్తున్నదని అన్నారు. సిపిఎం పోరాటాల ఫలితంగా ప్రభుత్వం చాలా సమస్యలు పరిష్కరించడం జరిగింది అని, రాబోయే కాలంలో మరిన్ని ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్మించే కొరకు చర్చించి భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించుకోవడం ఇట్టి మహాసభల్లో జరుగుతుంది అని అన్నారు.మహాసభల ప్రారంభం రోజున వేలాది మందితో ర్యాలీ సభ నిర్వహించడం జరుగు తుంది అని,జిల్లా నలుమూల నుంచి వచ్చే సిపిఎం ప్రతినిధులతో సభ నిర్వహించుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, జవ్వాజి విమల,సూరం పద్మ,అన్నందాస్ గణేష్. బింగి సంపత్ గడ్డం,రాజశేఖర్, జిదం కమలాకర్ తదితరులు పాల్గొన్నారు

## మత్తు పదార్థాలపై
# సాంస్కృతిక సారథి కళాకారుల కళా ప్రదర్శన



**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం మల్లాపూర్ గ్రామంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి పొత్తూరి రాజు కళా బృందం,కళా ప్రదర్శన చేసినారు. డ్రగ్స్,గంజాయి, మత్తు పదార్థాలకు యువకులు బానిస కావద్దని,మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు నాశనం అవుతాయని,మరియు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీ లను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని, పాట,మాట ద్వారా చక్కని కళా ప్రదర్శన ఇచ్చారు. అదేవిధంగా గ్రామంలో ఉన్నటువంటి ప్రతి ఒక్కరు కూడా గ్రామపంచాయతీ సిబ్బందికి తడి పొడి చెత్తను వేరువేరు చేసి గ్రామపంచా సిబ్బందికి అందించాలని, అదేవిధంగా పరిసరాల పరిశుభ్రత సీజనల్ వ్యాధులపై చక్కని పాటలు పాడి, ప్రజలను చైతన్య పరిచారు. అదేవిధంగా సీజనల్ వ్యాధులు పట్ల ప్రతి ఒక్కరు తగు జాగ్రత్తగా ఉండాలని,తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.స్వచ్ఛదనం, పచ్చదనంపై గ్రామ ప్రజలకు పాటల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారధి వేములవాడ టీం లీడర్ పొత్తూరి రాజు, కళాకారులు గడ్డం దేవయ్య, పూడూరు సంజీవ్, అంతర్పుల ఝాన్సీ, లావణ్య, కిన్నర శ్రీలత, అనుముల శిరీష, మరియు మల్లాపూర్ గ్రామ కార్యదర్శి కె.మహేందర్ రెడ్డి మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఓసీ మంజూరు చేసిన ప్రభుత్వ విప్

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చిన్నలింగపూర్ గ్రామానికి చెందిన శ్యాగా రాంచరణ్ అనారోగ్య సమస్యల వలన అత్యవసర చికిత్స అవసరం ఉన్నదని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కి చిన్నలింగపూర్ ఎంపీటీసీ బైరినేని రాము తెలియజేయగానే తక్షణమే స్పందించి నిమ్స్ ఆసుపత్రిలోని వైద్య సిబ్బందితో చర్చలు జరిపి ప్రత్యేకమైన చికిత్స అందించవలసిందిగా ఆదేశిస్తూ మరియు ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయంగా వెంటనే వైద్య ఖర్చులకు 1,50,000రూపాయలను ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మంజూరు చేశారు.అత్యవసర ఆరోగ్య చికిత్స నిమిత్తం ఎల్ఓసి మంజూరు చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కి కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**- ఏఐటీయూసీ డిమాండ్**

**బలగటివి ,తంగళ్లపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించి వారికి పెరిగిన ధరలకు అనుకూలంగా వేతనాలు చెల్లించాలని పని ప్రదేశంలో ప్రభుత్వం చెప్పే విధంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని తాడుమావుల ప్రతితనుకు 60 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల ఏడోవ తేదీన జరిగే జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాను విజయవంతం చేయాలని మండలంలోని ఇందిరమ్మ కాలనిలో కార్మికుల సమస్యల కరపత్రాన్ని విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అధ్య వేణు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సోమ నాగరాజు,హమాలి కార్మిక సంఘం నాయకులు బచ్ పల్లి శంకర్,బర్ల శ్రీనివాసు, బట్టు మల్లయ్య,కోట శంకర్,బర్ల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## టికెట్ చార్జీలు పెంచలేదు

- **టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్**

టీజీఎస్ఆర్టీసీ బస్సు టికెట్ ధరలను పెంచిందన్న ప్రచారంలో వాస్తవం లేదని సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ అన్నారు. రెగ్యులర్ సర్వీసులకు సాధారణ ఛార్జీలే అమల్లో ఉన్నాయని పేర్కొన్నారు. అయితే, దీపావళి తిరుగు ప్రయాణ రద్దీ నేపథ్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో మాత్రమే రాష్ట్ర ప్రభుత్వ జీవో మేరకు సంస్థ ఛార్జీలను సవరించిందని తెలిపారు. ప్రధాన పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యేక సర్వీసులను నడుపుతోందన్నారు.

అయితే తిరుగు ప్రయాణంలో ప్రయాణికుల రద్దీ లేకపోవడంతో ఆ ప్రత్యేక బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులకు అనుగుణంగా టిక్కెట్ ధరను సవరించుకోనేందుకు 2003లో రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 16ను జారీ చేసిందని వెల్లడించారు. పండుగలు, ప్రత్యేక సందర్భాలలో నడిచే ప్రత్యేక బస్సుల్లో మాత్రమే 1.50 వరకు టిక్కెట్ ధరలను సవరించే వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వం సంస్థకు కల్పించిందని తెలిపారు. ఇది గత 21 ఏళ్లుగా కొనసాగుతున్న అనవాయితీ అని స్పష్టం చేశారు.

## స్కూల్ గేటు విరిగిపడి బాలుడు మృతి

**బలగటివి ,హైదరాబాద్**



హయత్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విషాదం చోటుచేసుకుంది. పాఠశాల గేటు విరిగి ఒకటో తరగతి విద్యార్థిపై పడింది. ఈ ప్రమాదంలో బాలుడు మృతి చెందాడు. ఎస్ఐ నెహ్రూ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం నల్గొండ జిల్లా దామరచర్ల మండలం అడవిదేవుల పల్లి గ్రామానికి చెందిన చందు దంపతులకు ఒక్కగానొక్క కుమారుడు ఆలకంటి అజయ్(6). వారు బతుకు దెరువు కోసం నగరానికి వలస వచ్చి హాయత్ నగర్‌లోని ముదిరాజ్ కాలనీలో నివాసం ఉంటున్నారు. అజయ్ హాయత్ నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి చదువుతున్నాడు. సోమవారం అతను పాఠశాల ఆవరణలో ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో పాఠశాల ప్రధాన గేటు పట్టుకుని అటు ఇటు ఊగుతూ ఆడుకుంటుండగా ఆ గేటు వెల్డింగ్ జాయింట్లు ఊడి బాలుడి మీద పడింది. దాంతో అతని తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే బాలుడిని హాయత్ నగర్‌లోని ఓ ప్రయివేటు హాస్పిటల్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రతి కుటుంబం వివరాలు తప్పులు లేకుండా సేకరించాలి..



- **అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**

**బలగం టీవీ , సిరిసిల్ల :**

హౌస్ లిస్టింగ్ సర్వే లో ప్రతి కుటుంబం వివరాలు తప్పులు లేకుండా సేకరించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే(సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)లో భాగంగా సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ఒకటో వార్డ్, అలాగే కోనరావుపేట మండలం కొలనూర్, ధర్మారంలో కొనసాగుతున్న సర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ ఎన్యుమరేటర్ బ్లాక్ పరిధిలోని దాదాపు పది ఇండ్లలో చేపట్టిన హౌస్ లిస్టింగ్ సర్వేను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే(సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)లో భాగంగా తేదీ 01.11.2024 నుండి 03.11.2024 వరకు హౌస్ లిస్టింగ్ సేకరిస్తారనిఅన్నారు . ఇక్కడ ఎస్డీసీ రాధాభాయ్, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

**నిబంధనలకు అనుగుణంగా సరుకులు ఇవ్వాలి...**

రేషన్ దుకాణాల్లో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా లబ్ధిదారులకు సరుకులు ఇవ్వాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ఒకటో వార్డులోని రేషన్ దుకాణాన్ని అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. దుకాణంలో నిల్వ ఉన్న సరుకులు, రిజిస్టర్లు తనిఖీ చేసి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.



# కిటకిటలాడుతున్న శ్రీశైలం

**బలగటివి ,శ్రీశైలం**

శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్ల మహా పుణ్య క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతుంది. కార్తీక మాసం తొలి సోమవారం కావడంతో పరమ శివుని దర్శనానికి తెలుగు రాష్ట్రాల నుండే కాక ఉత్తర దక్షిణాది రాష్ట్రాల నుండి వచ్చిన యాత్రికులు తెల్లవారుజామునుండి క్యూలైన్లలో బారులుదీరారు. తెల్లవారుజుమున కృష్ణా నదిలో పుణ్య స్నానాలు చేసుకుని పసుపు కుంకుమలతో సారె సమర్పించి, కార్తీక దీప దానాలు చేశారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న కారణంగా శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి మూడు గంటల సమయం పట్టిందని అధికారులు తెలిపారు. స్వామివారికి సామూహిక అభిషేకాలు, గర్భాలయాభిషేకాలను మాసాంతం తాత్కాలికంగా నిలిపి వేసినట్లు ఈవో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. అదేవిధంగా అమ్మవారికి కుంకుమార్చనలు, చండీహెూమం, రుద్రయాగం, నిత్యకళ్యాణం భక్తులు పాల్గొన్నారు. కార్తీక మాసం ప్రత్యేకంగా ఓం నమ: శివాయ ప్రణవ పంచాక్షరీ మంత్రాన్ని కర్ణాటక ఆంధ్ర భజన బృందాలచే చతుస్సప్తాహ భజనలు నిరంతరం జరుగుతున్నాయి. ఆలయ ఉత్తర మాఢవీధితోపాటు గంగాధర మండపం వద్ద మహిళలు అధిక సంఖ్యలో కార్తీక దీపాలను వెలిగించుకున్నారు. ఆలయ దర్శనాలు ప్రారంభమై ముగిసేంత వరకు ఉచిత ప్రసాద వితరణ మరియు క్యూలైన్లలో దర్శనానికి వేచిఉండే భక్తులకు పాలు, మంచీనీరు, బిస్కెట్లు, అల్పాహారపొట్లాలు అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.